వానొస్తే వెతలే..

- ప్రమాదకరంగా పల్లిగెడ్డ కల్వర్టు
- శిథిలావస్థలో పొట్నూరు లోలెవెల్ కాజ్‌వే, బాందేవుపురం లోలెవెల్ ర్యాంపు
- అనంతవరం అలోపాలో గెడ్డపై అసంపూర్తిగా బ్రిడ్జి


మద్ది జంక్షన్‌కు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న పల్లి గెడ్డ కల్వర్టుపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

పద్మనాభం: వానొస్తే ఆ ప్రాంతాల్లో ప్రజలకు కంటిపై కునుకు ఉండదు. కల్వర్టులు, కాజ్‌వేలపై నీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు మార్గం ఉండదు. రక్షణ గోడలు లేకపోవడంతో సాధారణ రోజుల్లో కూడా ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుపై ప్రయాణమంటే హడలిపోతుంటారు. త్వరితగతిన కల్వర్టు, కాజ్‌వే నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'పల్లిగెడ్డ'పై బిక్కుబిక్కుమంటూ..

విజయనగరం–ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానంగా మద్ది జంక్షన్‌కు సమీపంలో పల్లె గెడ్డ కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. దీంతో సాధారణ రోజుల్లో కూడా రాకపోకలు సాగించడానికి ప్రజలు భయకంపితులవుతున్నారు. ఈ మార్గంలో సింహాచలం, విజయనగరం, విశాఖపట్నం వెళ్లే బస్సులు, ఆటోలు, లారీలు నిరంతరం తిరుగుతూ ఉంటాయి. డ్రైవర్లు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనాలు గెడ్డలోకి పల్టీ కొట్టి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. అనంతవరం, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, పెంట గ్రామాల ప్రజలు మండల కేంద్రం పద్మనాభానికి ఈ కల్వర్టు మీద నుంచే రావాలి. వర్షాలు కురిస్తే గెడ్డ నీరు కల్వర్టు మీద నుంచి పొంగి ప్రవహిస్తుంది. దీని వల్ల నీటి ఉధృతి తగ్గేంత వరకు వాహనాల రాకపోకలను నిలిపి వేస్తారు. ఈ కారణంగా ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుకోకుండా తిరిగి వెనక్కి వెళ్లిపోవల్సిన పరిస్థితి. కొంతమంది అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదమని తెలిసినా ఒకరినొకరు ఊత పట్టుకుని కల్వర్టు దాటి ఒడ్డుకు చేరుకుంటారు. కల్వర్టు కూడా శిథిలావస్థలో చేరుకుని ప్రమాదకరంగా ఉంది. ఇది ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. తూర్పు వైపు మదుములు కొన్ని పూడుకుపోయాయి.


పల్లి గెడ్డ కల్వర్టు పై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీటిలో నుంచి వెళుతున్న ప్రజలు (ఫైల్)

ప్రమాదకరంగా.. కాజ్‌వే


పొట్నూరు వద్ద శిథిలావస్థకు చేరుకున్న కాజ్‌వే


కాజ్‌వేపై నుంచి జోరుగా ప్రవహిస్తున్న వర్షపు నీరు (ఫైల్)

పొట్నూరు గ్రామ ప్రవేశంలో శ్రీ కృష్ణ దేవరాయల విజయ స్థూపం వద్ద దుమ్మిడి గెడ్డకు అనుసంధానంగా నిర్మించిన లోలెవెల్ కాజ్‌వే గోతులు పడింది. ఇరువైపులా ఉండే రక్షణ దిమ్మలు శిథిలమయ్యాయి. ఇది శిథిలమై 10 ఏళ్లు అవుతుంది. వర్షాలకు గెడ్డ నీరు, నూకాంబిక చెరువులో నీరు చప్టాల నుంచి వచ్చి కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇటువంటి సందర్భాల్లో పొట్నూరు గ్రామస్తులు గ్రామం విడిచి పైకి రాలేని పరిస్థితి.

వర్షం వస్తే రాకపోకలు బంద్


బాందేవుపురం వద్ద శిథిలావస్థకు చేరుకున్న లో లెవెల్ ర్యాంప్

మద్ది–అలమండ అండ్‌బీ ఆర్‌ఎస్ రోడ్డులో బాందేవుపురం గ్రామం లో లెవెల్ ర్యాంపు శిథిలమై పదేళ్లు కావస్తోంది. ఈ ర్యాంపు మీదుగా , విజయరాంపురం, బాందేవుపురం గ్రామస్తులు పద్మనాభం వస్తుంటారు. మద్ది, పద్మనాభం, కృష్ణాపురం, పాండ్రంగి గ్రామస్తులు దీని మీదుగా అలమండ సంతకు వెళతారు. వర్షాలకు గెడ్డ నీరు ప్రవహించేటప్పుడు రాకపోకలు బంద్ అవుతాయి.

నెలల తరబడి.. అసంపూర్తిగా


అలోపాలో గెడ్డ వద్ద అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జి

అనంతవరం–గంధవరం రోడ్డులో అలోపాలో గెడ్డపై ఉండే కల్వర్టు తుపానుకు కొట్టుకుపోయింది. దీని స్థానంలో రూ.30లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనులు అక్టోబర్‌లో ప్రారంభించారు. గోడలు నిర్మించి వదిలేశారు. శ్లాబ్ వేయలేదు. రెండు నెలల నుంచి పనులు నిలిపివేశారు. పనులు పూర్తయ్యేంత వరకు దీని పక్కన నుంచి గంధవరం గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి తాత్కాలికంగా మట్టితో డైవర్షన్ రోడ్డు వేశారు. వర్షాలకు దీనిపై నుంచి కూడా నీరు పొంగి ప్రవహిస్తుండడంతో గంధవరం గ్రామస్తులు పద్మనాభం, అనంతవరం రావడానికి ఇబ్బందులు పడుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు చేయాలి



అలోపాలో గెడ్డ మీద ఉండే పాత కల్వర్టు తుపానుకు కొట్టుకుపోయిన దగ్గరనుంచి చాలా ఇబ్బంది పడుతున్నాం. కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు ముందుకు సాగట్లేదు. డైవర్షన్ రోడ్డుపై కూడా నీరు పొంగి ప్రవహిస్తోంది. ఈ వర్షాకాలం ఎలా గడుస్తుందో. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. – కె.సూరినాయుడు, గంధవరం

భయంభయంగా ప్రయాణిస్తుంటాం



మద్ది జంక్షన్‌కు సమీపంలోని పల్లె గెడ్డ కల్వర్టుపై వర్షాలకు నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీనివల్ల విజయనగరం, సింహాచలం వెళ్లే బస్సులు, ఆటోలు నిలిపివేస్తారు. ఆ సమయంలో మా అవస్థలు చెప్పలేం. ఎక్కడికీ కదల్లేం. రక్షణ గోడల్లేకపోవడంతో మామూలు రోజుల్లో కూడా భయంభయంగానే ప్రయాణిస్తుంటాం. ఏ మాత్రం అదుపుతప్పినా వాహనాలు గెడ్డలో పల్టీ కొట్టి, ప్రాణాలు గాలిలో కలిసిపోవడమే. అధికారులు స్పందించి కొత్త కల్వర్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి. – కె.రాజన్న, మద్ది

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకులకు చిన్నశ్రీను పరామర్శ


పద్మనాభంను పరామర్శిస్తున్న చిన్న శ్రీను

పద్మనాభం: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ నాయకులను మంగళవారం పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురైన పద్మనాభం వైఎస్సార్‌సీపీ నాయకుడు తాళాడ పద్మనాభంను, అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై విశాఖలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోరాడ పంచాయతీకి చెందిన కోరాడ రామును పరామర్శించి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకుని పార్టీకి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, నాయకులు బుగత సత్యనారాయణ, తాళాడ నరసింహనాయుడు, గాడు అప్పలరాజు తదితరులు ఉన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు నాశనం


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవాణి

తగరపువలస: మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు నాశనం అవుతుందని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అన్నారు. నషా ముక్త్ భారత అభియాన్ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. జాతి నిర్మాణంలో బలమైన శక్తిగా ఉన్న యువత మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. భారత్‌ను మాదకద్రవ్య రహిత దేశంగా మార్చేందుకు యువత ముందుకు రావాలన్నారు. మాదక ద్రవ్యాల ప్రభావం మొదట వ్యక్తులపై, తరువాత సమాజంపై పడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదీ సారథ్యంలోనే దేశాభివృద్ధి

పద్మనాభం: ప్రధాని మోదీ సారథ్యంలోనే దేశం వివిధ విభాగాలలో అభివృద్ధి చెందిందని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు. 11 ఏళ్ల బీజేపీ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ మంగళవారం కొవ్వాడ పంచాయతీలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిరిపురపు వెంకటరావు, కలగర్ల పేర్రాజు, మచ్చ సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు


లలితాపీఠంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన కర పత్రాలను పీఠంలోని వారాహిదేవి సన్నిధిలో పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 4:30 గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకం, సాయంత్రం 7కు సహస్రనామార్చన, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఈ నెల 29(ఆదివారం)న వారాహి హోమం చేయనున్నట్లు వెల్లడించారు. నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తులు, అమ్మవారికి చీర ధరింపదలచిన వారు, ప్రసాద వితరణలో పాల్గొనదలచిన వారు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

రాయితీపై వరి విత్తనాలు సిద్ధం


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి

తగరపువలస: రైతుసేవా కేంద్రాల్లో కిలో రూ.5 రాయితీతో 293 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఆనందపురం మండల వ్యవసాయాధికారిణి చావా సంధ్యారత్న ప్రభ తెలిపారు. గొట్టిపల్లిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విత్తనాలు వేసే ముందు శుద్ధి చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన గురించి వివరించారు. రైతులకు ఈ బీమా వర్తించాలంటే వరి పంటకు ఎకరాకు రూ.420 చెల్లించాలన్నారు. బ్యాంకులలో పంట రుణాలు ఉన్న రైతులకు బ్యాంకు సిబ్బందే రుణం నుంచి ప్రీమియం వసూలు చేస్తారన్నారు. లేదంటే దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో బీమా ప్రీమియం కట్టుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్సీ వ్యవసాయాధికారి సీహెచ్ సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జి.రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

భీమిలి ప్రజల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి రాంబాబు

తగరపువలస: భీమిలి పట్టణ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు పరిష్కరించాలని భీమిలి ఏరియా సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గుజ్జు రామునాయుడు భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి కానూరి రాంబాబు మాట్లాడారు. తగరపువలసలో తక్షణం ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అంబేడ్కర్ కూడలిలో షెల్టర్లు, సులాభ్ కాంప్లెక్స్‌లు లేక ప్రయాణికులు నరకయాతన పడుతున్నారన్నారు. తగరపువలస పట్టణంలోకి బస్సులు రాకపోవడంతో శ్రీకాకుళం, విజయనగరం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిట్టివలస రైతుబజారులో పూర్తి స్థాయిలో దుకాణాలు ప్రారంభించాలని కోరారు. సమావేశంలో నాయకులు మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, మావూరి వీర్రాజు, సన్నిబాబు, అల్లం గోవిందరావు, అప్పారావు, లక్ష్మణరావు, తోటయ్య తదితరులు పాల్గొన్నారు.

'కేంబ్రిడ్జ్ చెక్‌పాయింట్' ఫలితాల్లో ఓక్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ


జెన్యా


గంటా షైలి


కల్యాణి రూా


రియా మహలక్ష్మి

తగరపువలస: కేంబ్రిడ్జ్ చెక్‌పాయింట్ 2025 అధ్యయనాలలో భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రైమరీ, లోయర్ సెకండరీ విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబరిచారని ప్రిన్సిపాల్ భమిటిపాటి శైల తెలిపారు. తమ విద్యార్థులు గణితం, సైన్స్ రంగాలలో అంతర్జాతీయ సగటును మించిపోయారన్నారు. విద్యార్థిని జెన్యా ఇంగ్లిష్, సైన్స్, గణితంలో 50కు 50 మార్కులు సాధించి అంతర్జాతీయ స్థాయిలో అగ్రశ్రేణిలో నిలిచారన్నారు. గంటా షైలి 48 మార్కులు, కల్యాణి రూా సైన్స్‌లో 50 మార్కులు, రియా మహలక్ష్మి 40 మార్కులు సాధించారని చెప్పారు. ఈ ఫలితాలు తమ విద్యార్థుల కృషి, పట్టుదల విజ్ఞాన సాధనకు ప్రతిబింబం అన్నారు.

పోలీస్ అవుట్‌పోస్టులతో నేర నియంత్రణ

వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ


రైల్వేస్టేషన్ జ్ఞానాపురం అవుట్‌గేట్ వద్ద పోలీస్ అవుట్‌పోస్టును ప్రారంభిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ



అవుట్‌పోస్టు ప్రారంభించి, స్థానికులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ

తాటిచెట్లపాలెం: నేర నియంత్రణకు పోలీస్ అవుట్‌పోస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని వెస్ట్ జోన్ సబ్ డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ తెలిపారు. జ్ఞానాపురం రైల్వేస్టేషన్ అవుట్ గేట్ సమీపంలో కంచరపాలెం పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్టును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రైల్వేస్టేషన్ పరిసరాల్లో నేరాలు నియంత్రించేందుకు పోలీస్ అవుట్‌పోస్టు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇక్కడ షిఫ్ట్‌ల ప్రకారం రోజూ 9 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సమీప ప్రాంతాల్లో ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంచరపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ సమీర్, రవికుమార్, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సమాచార శాఖ డీడీ

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖ కార్యాలయ ఉప సంచాలకులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె. సదారావు మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, అక్రిడిటేషన్ల వ్యవహారాలు, ఇతర అంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై సదారావుకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

వైఎస్సార్‌సీపీ మండల, వార్డు అధ్యక్షుల నియామకం

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గంలో మండల, జీవీఎంసీ వార్డుల అధ్యక్షుల నియామకం మంగళవారం జరిగింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం జాబితాను విడుదల చేసింది. భీమిలి మండల అధ్యక్షునిగా గాడు శ్రీనివాసరావు, ఆనందపురం అధ్యక్షునిగా బంక సత్యనారాయణ, పద్మనాభం అధ్యక్షునిగా కోరాడ లక్ష్మణరావులను తిరిగి నియమించారు. అలాగే జీవీఎంసీ మధురవాడ జోన్‌లో 5,6,7,8 వార్డుల అధ్యక్షులుగా పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి మళ్లీ నియమితులయ్యారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పీఎం పాలెం: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పీఎం పాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 8వ వార్డు పరిధి పనోరమా హిల్స్ గేటు ఏరియాలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక ఎస్‌ఐ భాస్కర్ సిబ్బందితో నిఘా వేసి పశ్చిమ బెంగాల్‌కు చెందిన అక్తర్ రషీద్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుని విచారించగా పనోరమా హిల్స్‌లోని డీఎల్ 66 విల్లాలో అద్దెకు నివాసం ఉంటున్న ఆదిల్ ఆసీఫ్ అనే వ్యక్తి గంజాయి కొనడం అమ్మడం వంటి పనులు చేయిస్తున్నాడని పోలీసులకు తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్న అక్తర్ రషీద్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదే కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడు ఆదిల్ ఆసీఫ్‌ను అరెస్టు చేయవలసి ఉందని సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు టైరుపేలి ఒకరికి గాయాలు

ఎంవీపీకాలనీ: ఇసుకతోట జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు టైరు పేలడంతో అందులో ప్రయాణిస్తున్న మామిడి వెంకటరావు (45) అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కొత్తవలసకు చెందిన వెంకటరావు కుటుంబంతో కలిసి ఈ నెల 22న ఆర్టీసీ రూట్ నంబర్ 68కే బస్సులో ఆర్కే బీచ్‌కు బయలుదేరాడు. 4 గంటల సమయంలో బస్సు ఇసుకతోట కూడలికి చేరుకోగా ఒక్కసారి భారీ శబ్దంతో బస్సు టైరు పేలిపోయింది. దీంతో బస్సు టైరుకు సమీపంలోని సీట్లో కూర్చున్న వెంకటరావుకు కొన్ని టైర్ ఇనుప భాగాలు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని బస్సు డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఓమ్ని ఆర్కే ఆసుపత్రికి తరలించగా ఎక్స్‌రేలో అతని ఎడమ కాలు విరిగినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో నాణ్యతలేని టైర్లు వాడుతూ ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని పేర్కొంటూ వెంకటరావు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం వైభవంగా 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది హాజరయ్యారు.

జెడ్పీ హైస్కూల్ బాలికలకు ట్రిపుల్ ఐటీ సీట్లు


చిల్ల లాస్య


బి.ఒలీవా


ఎం. వర్షిణి


ఎస్.ఢిల్లీశ్వరి


జి.వర్ధిని

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీట్లు లభించాయి. వీరిలో మాదాబత్తుల వర్షిణి, బి.ఒలీవా, చిల్ల లాస్య ఉన్నారు. వీరిని ప్రధానోపాధ్యాయిని శివజ్యోతి, ఇటీవల బదిలీపై వెళ్లిపోయిన ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రోజామణి, ఉపాధ్యాయులు అభినందించారు.

- ఆనందపురం మండలం లొడగలవానిపాలెం కేజీబీవీకి చెందిన ఎస్.ఢిల్లీశ్వరి, జి.వర్ధినికి కూడా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీట్లు లభించాయి. వీరిని ప్రిన్సిపాల్ ఎస్.సత్యలావణ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుబజారు వద్ద ప్రత్యామ్నాయ రోడ్డుకు చర్యలు


స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దారు పాల్‌కిరణ్, జెడ్సీ కనకమహాలక్ష్మి తదితరులు

మధురవాడ: రైతుబజారు వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు విశాఖ రూరల్ మండల తహసీల్దారు పాల్‌కిరణ్, జోన్–2 జోనల్ కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి తెలిపారు. ఈ నేపథ్యంలో వారు మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలసి రైతు బజార్, పక్కనే పోలీస్ డంపింగ్ యార్డులో నుంచి లేదా పక్క నుంచి రోడ్డు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. తహసీల్దార్ పాల్‌కిరణ్ మాట్లాడుతూ ఇటు పోలీస్ డంపింగ్ యార్డుకి, రైతు బజార్‌కి వచ్చేవారెవరికీ ఇబ్బంది లేకుండా రోడ్డు ఏర్పాటు చేసేందుకు అన్ని మార్గాలు పరిశీలిస్తున్నామన్నారు. ముందుగా పోలీస్ శాఖ ఎంత స్థలం ఇచ్చారో పరిశీలించి, తర్వాత నిర్ధారణకు రావాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంతో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ దాట్ల హరిత, ఏసీపీ తిరుపతిరావు, ఈఈ శాంతిరాజు, టీడీపీ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, ఈగల రవి పలువురు అధికారులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు



తులసిమాలల అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు, నమ్మివానిపేట మరిడిమాంబ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం 109వ అలంకరణలో భాగంగా తులసి, గజ మాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు విజయనగరం జిల్లా డెంకాడ మండలం కొండరాజుపేట గ్రామానికి చెందిన కండ్రెడ్డి గౌరిరెడ్డి సహాయ సహకారాలు అందించారు. జీవీఎంసీ రెండోవార్డు నమ్మివానిపేటకు చెందిన మరిడిమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు తులసి మాలలతో అలంకరించారు.

29న విశాఖ అభివృద్ధి-నిధులు-సంస్కరణలపై సదస్సు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: అభివృద్ధి, నిధులు, సంస్కరణలపై ఈ నెల 29న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు పోస్టర్‌ను అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ జీఎస్ రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు బుజ్జి, సీహెచ్ సత్యనారాయణ, టి.కామేశ్వరరావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సదస్సులో పలువురు ప్రముఖులు ప్రసంగించనున్నారని తెలిపారు. వారిలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ విశ్రాంత ఆచార్యుడు ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య, విజయవాడ ఎంబీవీకే చైర్మన్ పి.మధు, ఏపీ పట్టణ పౌర సమైక్య సీహెచ్ బాబూరావు, జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, వార్వా ప్రతినిధి ప్రకాశరావు, నివాస్ ప్రతినిధి పి.నారాయణమూర్తి ఉన్నారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖ.. రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న ఐటీ పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి ఏర్పడిందని, మెట్రో రైల్ వంటివి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. విశాఖకు వెన్నెముక వంటి స్టీల్‌ప్లాంట్‌ను సైతం అమ్మకానికి పెడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ సదస్సు ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని, నగర పౌరులు పెద్ద ఎత్తున పాల్గొని విశాఖ అభివృద్ధిపై చర్చలో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.